సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం, 24, ఫిబ్రవరి, 2025



ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
పెళ్లి బృందంతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. - 8లో



నెరవేరిన బీటీ కల
కాచారం, కుమ్మరిగూడెం, యాసోజిగూడెం బాహుపేట, తాళ్లగూడెం, పెద్దకందుకూరు రహదారులకు బీటీ వేశారు. - 9లో



ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు
మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయిస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట : యాదగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. ఆలయ ధ్వజస్తంభం, మహా నందీశ్వరుడి విగ్రహం ఎదుట శివానుగ్రహంతో విశ్వశాంతి కలిగి, లోకమంతా సురక్షితంగా ఉండాలని శైవాగమ సంప్రదాయంతో స్వస్తివాచన వేడుక, విఘ్నేశ్వర పూజలు నిర్వహించారు. అనంతరం పూజా ద్రవ్యాలతో ఆలయ పరిసరాలను సంప్రోక్షణ చేసి పుణ్యాహవాచన వేడుక జరిపించారు. అదే విధంగా మహా శివుడికి, ఆ తరువాత ఉత్సవ నిర్వాహకులు, యాజ్ఞికులు, అర్చకులు, అధికారులకు కంకణధారణ చేశారు. సాయంత్రం సమక, చమక పారాయణాలు, మంత్ర పుష్ప పఠనాలు, అంకురారోపణం, సోమకుంభ కలశస్థాపన, దేవతారాధన పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

అఖండజ్యోతి రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం

భువనగిరి : యాదగిరిగుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అఖండజ్యోతి రథయాత్ర పోస్టర్‌ను ఆదివారం భువనగిరిలోని వివేరా హోటల్‌లో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, వేముల వీరేశం ఆవిష్కరించారు. రథయాత్ర అధ్యక్షుడు ఫక్కీర్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శెట్టి బాలయ్య యాదవ్, సభ్యులు దేవరకొండ నర్సింహాచారి, కరిపే నర్సింగ్‌రావు, సత్యనారాయణరెడ్డి, విశ్వేశ్వరరావు, ఉపేంద్రరావు, రాజయ్య, పింగళిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

భువనగిరి: 2025– 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగన పరీక్షకు మొత్తం 3,678 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3,522 మంది విద్యార్థులు హాజరయ్యారు. 156 మంది గైర్హాజరైనట్లు భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

భువనగిరి మీదుగా వెళ్లిన సీఎం కాన్వాయ్

భువనగిరి: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో భువనగిరి బైపాస్ మీదుగా వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హైదరాబాద్‌కు సీఎం కాన్వాయ్ వెళ్లింది. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని అనంతారం, శ్రీరేణుక ఎల్లమ్మ, సింగన్నగూడెం, నల్లగొండ రోడ్డు మార్గంలోని బైపాస్ రోడ్డు, రాయగిరి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు వెళ్తారని అంతా భావించారు. అధికారుల షెడ్యూల్‌లో కూడా హెలికాప్టర్ ద్వారానే వస్తారని వెల్లడించారు. కానీ, రోడ్డు మార్గంలో యాదగిరిగుట్టకు వెళ్లారు.

'ఐఎంఏ జూనియర్ డాక్టర్ల వైఖరి సరికాదు'

నల్లగొండ టౌన్ : గ్రామీణ స్థాయిలో ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించి ప్రాణాపాయం నుంచి కాపాడుతున్న గ్రామీణ వైద్యుల పట్ల ఐఎంఏ జూనియర్ డాక్టర్లు చులకన భావంతో మాట్లాడడం సరికాదని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నల్లగొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం నల్లగొండలోని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరాం దిష్టిబొమ్మను ఐఎంఏ జూనియర్ డాక్టర్లు దగ్ధం చేయటం హేయమైన చర్య అన్నారు. గ్రామీణ వైద్యులు సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గతంలో ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణనిచ్చి క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్యం అందించాలని ప్రోత్సహించిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో శ్రీనివాసరాజు, జి.నర్సింహారెడ్డి, సీహెచ్.బ్రహ్మచారి, డీఎస్ఎన్.చారి, నజీరుద్దీన్, వెంకటేశ్వర్లుగౌడ్, ఎం.మధనాచారి, యాదగిరి, లలిత, మణికుమారి పాల్గొన్నారు.

దివ్య మందిరం.. స్వర్ణశోభితం

బంగారు తాపడంతో రూపుదిద్దుకున్న యాదగిరి క్షేత్ర విమాన గోపురం



యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపురం



శాంతికల్యాణం..



స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, ఈఓ భాస్కర్‌రావు, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్



సతీమణి గీతకు కంకణధారణ చేస్తున్న రేవంత్‌రెడ్డి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

దేశంలోనే ఎత్తయిన విమాన గోపురం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురం దేశంలోని ఆలయాల్లో కెల్లా ఎత్తయినదని, అంత ఎత్తులో ఉన్న విమాన గోపురానికి బంగారు తాపడం పనులు పూర్తి చేయడం ఇదే ప్రథమమని ఆలయ అధికారులు, అర్చకులు చెబుతున్నారు.

- విమాన గోపురం 50.5 అడుగుల ఎత్తు, 10,759 చదరపు అడుగుల వైశాల్యం
- భక్తులు, దాతలు విరాళంగా సమర్పించిన బంగారం 68 కిలోలు
- చెన్నైకి చెందిన ఎంఎస్ స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ 2024 డిసెంబర్ 1న స్వర్ణ తాపడం పనులు ప్రారంభించింది.
- తమిళనాడుకు చెందిన స్తపతి రవీంద్రన్ 50 మంది కార్మికులతో కలిసి విమానగోపురానికి తాపడం కవచాల బిగింపు పనులను ఈనెల 18న పూర్తి చేశారు.
- బంగారు తాపడం బిగింపునకు రూ.5.10 కోట్లు (జీఎస్టీ కాకుండా) ఖర్చు చేశారు. ఇందులో రాగి రేకుల తయారీకి రూ.12లక్షలు వెచ్చించారు.

- దేశంలోని ఆలయాల్లోనే ప్రప్రథమం
- ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- వానమామలై రామానుజ జీయర్ స్వామితో కలిసి శ్రీలక్ష్మీనృసింహుడికి అంకితం
- వైభవంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం

యాదగిరిగుట్ట : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది. భక్తులు, దాతలు సమర్పించిన బంగారంతో రూపుదిద్దుకున్న ఆలయ స్వర్ణ విమాన గోపురాన్ని ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామితో కలిసి శ్రీలక్ష్మీనారసింహుడికి అంకితం ఇచ్చారు. స్వర్ణతాపడంతో దివ్య విమానగోపురం భక్తులను కనువిందు చేస్తోంది. ఇప్పటికే గర్భాలయ ద్వారాలు, ధ్వజస్తంభం, రాజగోపురాల విమానాలు, అష్టభుజి ప్రాకారాలపై ఉన్న విమానాల కలశాలకు బంగారు తాపడం చేసి బిగించారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో శ్రీస్వామి వారి క్షేత్రం అద్భుతంగా కనిపించేలా బంగారు వర్ణంలో ఉండే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయమంతా స్వర్ణమయంతో కాంతులీనుతుంది.

ఐదు రోజుల పాటు కొనసాగిన యాగం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా ఈ నెల 19వ తేదీన పంచకుండాత్మక యాగానికి శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల పాటు సాగిన ఈ యాగంలో చివరి రోజు ఆదివారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో శ్రీస్వామి, అమ్మవార్లకు శాంతికల్యాణం పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించి పంచకుండాత్మక యాగాన్ని ముగించారు. అంతకుముందు స్వర్ణ విమాన గోపురం వద్ద శాస్త్రోక్తంగా వానమామలై రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అర్చకులు మహా కుంభాభిషేకం, సంప్రోక్షణ వేడుక జరిపించి శ్రీస్వామి వారికి అంకితం ఇచ్చారు. శ్రీస్వామి వారి పంచకుండాత్మక యాగంలో, మహా కుంభాభిషేక సంప్రోక్షణ వేడుకలో కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం కార్యాలయ ఓఎస్‌డీ శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, దేవస్థానం ఈఓ ఏ.భాస్కర్‌రావు, దేవస్థాన అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, దేవరకొండ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, బాలునాయక్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ సీపీ సుధీర్ బాబు, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ రాహుల్‌రెడ్డి, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ బండ్రు శోభారాణి, వైటీడీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కిషన్ రావు, విజయ డైయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, కె.గంగాధర్, గోల్డ్ ప్లేటింగ్ కమిటీ సభ్యులు గోవింద హరి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఈఓ భాస్కర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి స్వాగతం పలికారు. వీరితో పాటు ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, బాలునాయక్ తదితర ప్రముఖులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు యాదగిరి క్షేత్ర సన్నిధిలో ఒక గంట 53 నిమిషాలు గడిపారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలు దేరిన సీఎం దంపతులు ఉదయం 11.15 గంటలకు యాదగిరి కొండపై గల అతిథి గృహానికి చేరుకున్నారు.
- అతిథిగృహంలో సంప్రదాయ దుస్తులు ధరించి 11.20కి లిఫ్టు మార్గంలో ఉత్తర మాడ వీధిలోకి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా పంచకుండాత్మక యాగశాలలోకి వెళ్లి కుంభాభిషేకానికి ఉపయోగించే జలాలకు పూజలు నిర్వహించారు.
- 11.28కి యాగశాల నుంచి ఉత్తర ద్వారం దక్షిణ తిరు వీధులోకి వచ్చారు.
- నిచ్చెన మెట్ల ద్వారా విమాన గోపురం వద్దకు 11.32 గంటలకు చేరుకున్నారు.
- 11.32కు స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించారు.
- 11.35కు విమానగోపురంపై ఉన్న శ్రీసుదర్శన చక్రం వద్దకు వెళ్లి వానమామలై రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో పూజలు చేశారు. –11.45కు సుదర్శన చక్రానికి, స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేక, సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.
- 11.52కు సుదర్శన చక్రం చుట్టూ సీఎం దంపతులు, ప్రముఖులు, అర్చకులు ప్రదక్షిణలు చేశారు.
- 11.56కు సుదర్శన చక్రం నుంచి విమాన గోపురం వద్దకు చేరుకుని తూర్పు త్రితల ద్వారం మార్గంలో ప్రధానాలయంలోకి వెళ్లారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.
- 12.10కి గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్నారు.
- 12.20కి ముఖ మండపంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతో పాటు సీఎస్ శాంతికుమారి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులకు ప్రధానాచార్యులు వేద ఆశీర్వచనం చేశారు.
- 12.25కు ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి శ్రీస్వామి వారి మహాప్రసాదాన్ని, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఈఓ భాస్కర్‌రావు సీఎం దంపతులకు విమాన గోపుర ప్రతిమ అందజేశారు.
- 12.28కు సీఎం దంపతులు.. వానమామలై రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం హుండీల్లో కానుకలు సమర్పించారు.
- 12.33కు పశ్చిమ ద్వారం నుంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు.
- 12.35కు లిఫ్టు మార్గంలో అతిథి గృహానికి చేరుకున్నారు.
- 12.40 నుంచి 1.05 గంటల వరకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
- 1.08కి యాదగిరి కొండపై నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లి తన చిన్ననాటి స్నేహితుడి కుమార్తె వివాహంలో పాల్గొన్నారు. అక్కడే భోజనం చేసి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు.



విమానగోపురం వద్దకు వస్తున్న సీఎం దంపతులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి తదితరులు



సీఎం దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకుడు



పంచకుండాత్మక యాగ పూజలో పాల్గొన్న సీఎం దంపతులు

భయం వద్దు.. నిర్భయంగా చికెన్ తినొచ్చు

- బర్డ్ ఫ్లూపై ప్రజల్లో భయం పోగొట్టేందుకు వ్యాపారుల ప్రయత్నం
- ఉచితంగా చికెన్, కోడిగుడ్లు, చికెన్ పకోడి పంపిణీ

భువనగిరిటౌన్, చౌటుప్పల్ : బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తినడంపై జనాల్లో ఉన్న భయాన్ని పోగెట్టేందుకు ప్రభుత్వం, వైద్యులు అనేక ప్రకటనలు చేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ కేవలం పక్షులకు మాత్రమే వస్తుందని, మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు. మరోవైపు చికెన్ వ్యాపారులు చికెన్ మేళాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని కుమ్మరివాడ, ఆర్‌బీనగర్‌లో చికెన్ షాపుల యజమానులు చికెన్ పకోడీ పంపిణీ చేశారు. అయితే చికెన్ పకోడీ పంపిణీ చేస్తున్న విషయం తెలియడంతో జనాలు ఒక్కసారిగా ఎగబడ్డారు. దాదాపు 200 కేజీల చికెన్ పకోడీ పంచగా.. కేవలం 30 నిముషాల్లో ఖాళీ అయింది. అదే విధంగా చౌటుప్పల్ పట్టణంలో వెన్‌కాబ్, స్థానిక పౌల్ట్రీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో చికెన్ మేళా ఏర్పాటు చేశారు. 500కిలోల ఉడికించిన చికెన్, 3వేల కోడిగుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేళా నిర్వాహకులు సెంథిల్‌కుమార్, గంగిడి ఆనందరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





భువనగిరిలో చికెన్ పకోడి కోసం బారులుదీరిన జనం, ఇనసెట్‌లో చికెన్ పకోడి చేస్తున్న నిర్వాహకులు

ఉత్కంఠ పోరు..

- హోరాహోరీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- ప్రధాన సంఘాల అభ్యర్థుల మధ్యే పోటీ
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ఉత్కంఠ రేపుతోంది. అభ్యర్థులంతా ప్రధాన సంఘాల్లో పనిచేసినవారే ఉండటంతో టఫ్ ఫైట్ సాగుతోంది. అభ్యర్థులను గెలిపించుకునేందుకు సంఘాలు, రాజకీయ పార్టీలు వ్యూహాలు అమలు చేస్తున్నాయి.

ఐదారుగురి మధ్యే ప్రధాన పోటీ

ఎన్నికల్లో ఐదారుగురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. యూటీఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ–టీఎస్ నుంచి పింగళి శ్రీపాల్‌రెడ్డి, టీచర్స్ జేఏసీలోని కీలక సంఘాలు, అధికార కాంగ్రెస్ అంతర్గత ఆశీస్సులతో ఆ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్టీయూ మద్దతు, బీసీ వాదంతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీపీయూఎస్ మద్దతుతో బీజేపీ అధికారిక అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డి పోటీ చేస్తుండగా, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి సుందర్‌రాజు యాదవ్ కూడా బీసీ వాదంతో బరిలోకి దిగారు.

బలమైన సంఘాలుగా పీఆర్‌టీయూ–టీఎస్, టీఎస్‌యూటీఎఫ్

ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డినే యూటీఎఫ్ మళ్లీ బరిలో నిలిపింది. అభ్యర్థిని ప్రకటించి నాటి నుంచే ఆ సంఘం ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టింది. డివిజన్లు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. పీఆర్‌టీయూ–టీఎస్ మద్దతుతో పింగళి శ్రీపాల్‌రెడ్డి ప్రస్తుతం పోటీలో ఉన్నారు. ఆ సంఘం జిల్లా, మండల శాఖలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ రెండు సంఘాలకు క్షేత్రస్థాయిలో సభ్యత్వం ఉంది. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన చరిత్ర కూడా ఉంది. అయితే ఈసారి ఉపాధ్యాయులు ఏవైపు మొగ్గుతారన్నది తేలాల్సి ఉంది.

హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ అంతర్గత మద్దతు

టీచర్ జేఏసీలోని మెజారిటీ సంఘాల మద్దతుతో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్సీ బరిలోకి దిగారు. ఆయన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందు నుంచే ప్రచారం చేస్తున్నారు. ఈయన కూడా గతంలో పీఆర్‌టీయూ–టీఎస్‌లో పని చేసినవారే. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనకు అంతర్గత మద్దతు ఉంది.

బీజేపీ అభ్యర్థిగా సరోత్తంరెడ్డి

పీఆర్‌టీయూ–టీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పులి సరోత్తంరెడ్డి ఈసారి బీజేపీ నుంచి బరిలో నిలిచారు. పీఆర్‌టీయూ–టీఎస్‌లోని పాత కేడర్ కూడా ఆయనకు పనికొస్తుందనే ధీమాతో ఉన్నారు. ఆయనకు టీపీయూఎస్ ప్రచారం చేస్తుండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్ వంటి నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

బీసీ వాదంతో పూల రవీందర్

మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ బీసీ వాదంతో బరిలోకి దిగారు. ఎస్టీయూ, బీసీ సంఘాల మద్దతు ఆయనకు ఉంది. తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులుతో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతిచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థల యజమాని సుందర్‌రాజు యాదవ్ కూడా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు.

ఆ సంఘం నుంచి వచ్చినవారే ఎక్కువ..

ఈసారి పోటీలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో పింగళి శ్రీపాల్‌రెడ్డి ప్రస్తుత పీఆర్‌టీయూ అధ్యక్షుడు, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పీఆర్‌టీయూ మాజీ నాయకుడు. పూల రవీందర్ కూడా పీఆర్‌టీయూ మద్దతుతోనే గతంలో ఎమ్మెల్సీ కాగా, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి పీఆర్‌టీయూ– టీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడే కావడం గమనార్హం.



స్వర్ణ విమాన గోపురం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ విప్ ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావు



విమాన గోపురంపై శ్రీనృసింహస్వామి, ఇతర దేవతామూర్తుల విగ్రహాలు



సీఎం రేవంత్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు





స్థపతి రవీంద్రన్‌కు, ఆలయ ప్రధానార్చకుడికి బంగారు కడియాలు తొడుగుతున్న రేవంత్‌రెడ్డి



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సంప్రోక్షణ చేసేందుకు నదీ జలాలను తీసుకెళ్తున్న అర్చకులు, సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



సీఎం దంపతులకు విమాన గోపుర ప్రతిమను అందజేస్తున్న దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఈఓ భాస్కర్‌రావు



పారిశుద్ధ్య కార్మికులతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



ఆలయ ముఖ మండపంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- మహిళ మృతి, 11మందికి గాయాలు
- మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి బైపాస్ వద్ద ఘటన



సునీత (ఫైల్)



ఘటనా స్థలంలో ట్రాక్టర్



రోడ్డు పక్కన గోడను ఢీకొని ఆగిపోయిన బస్సు

మిర్యాలగూడ అర్బన్ : పెళ్లి బృందంతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ మృతిచెందగా.. 11మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు శనివారం ఉదయం వేగ ప్రైవేట్ బస్సులో బయల్దేరి హైదరాబాద్‌లో తమ బంధువుల పెళ్లికి హాజరయ్యారు. పెళ్లి ముగిసిన అనంతరం శనివారం అర్ధరాత్రి స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున బస్సు మిర్యాలగూడకు చేరుకుంటున్న సమయంలో చింతపల్లి బైపాస్ వద్ద బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకున్నాడు. దీంతో బస్సు అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై వెళ్తున్న నూనావత్ సునీత(45) అక్కడికక్కడే మృతిచెందగా.. ట్రాక్టర్ నడుపుతున్న సునీత భర్త సైదానాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. సైదానాయక్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బస్సులో 30మంది ప్రయాణిస్తుండగా బస్సు డ్రైవర్ రెడ్డి శేఖర్, క్లీనర్ షేక్ ఉమర్‌తో పాటు నెల్లూరు జిల్లా కేంద్రానికి చెందిన గిద్దలూరు శివరామకృష్ణ, అదే జిల్లా వెంకటగిరికి చెందిన తోటపల్లి నాగచరిత్, తోటపల్లి రాజశేఖర్, నిడిగుంటి లక్ష్మీప్రసన్న, కొడలూరు సురేందర్‌రావు, స్వర్ణ శైలజ, నెల్లూరు జిల్లా చెన్నూరుకు చెందిన నేడిగంటి అఖిలమ్మ, ఆత్మకూరుకు చెందిన తూపిరి రాధ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న బాధితుల కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రథమ చికిత్స అనంతరం వారిని స్వస్థలాలకు తీసుకెళ్లారు.

బొడ్రాయి ప్రతిష్ఠకు బయల్దేరి..

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దుబ్బతండా(జటావత్‌తండా)కు చెందిన నూనావత్ సునీత, సైదానాయక్ దంపతులు రెండు దశాబ్దాల క్రితం మిర్యాలగూడ మండలం ట్యాంక్ తండాకు వలస వచ్చి భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారు కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేశారు. తమ స్వస్థలం దుబ్బతండాలో సోమవారం జరిగే బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు దంపతులిద్దరూ ట్రాక్టర్‌పై వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మృతురాలు సునీతకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండేళ్ల క్రితం పెద్ద కుమార్తె నాగలక్ష్మి వివాహం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు

హుజూర్‌నగర్: వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను ఆదివారం హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు విలేకరులకు వెల్లడించారు. ఇటీవల మఠంపల్లి మండలం సుల్తాన్‌పూర్ తండాలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి పుస్తెలతాడు, రెండు ఉంగరాలు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మఠంపల్లి పోలీసులు వేలు ముద్రలు సేకరించారు. గతంలో చోరీలు చేసి పట్టుబడిన హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ నాగుల్ మీరా, వీసం గోపి, షేక్ అబ్దుల్‌ను శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు మఠంపల్లి, హుజూర్‌నగర్‌లోనే కాకుండా అనంతగిరి, కోదాడ టౌన్, కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి 4.4 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో మఠంపల్లి ఎస్‌ఐ పి. బాబు, హుజూర్‌నగర్ ఏఎస్‌ఐ బలరాంరెడ్డి, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు నాగరాజు, శంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని బలవన్మరణం

వేములపల్లి(మాడ్గులపల్లి): భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలో జరిగింది. ఆదివారం ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన నక్క వెంకన్న(35) భార్య కాపురానికి రాకపోవడంతో పాటు ఆమె తరఫు వ్యక్తులు వెంకన్నను బెదిరించడంతో మనస్తాపానికి గురైన వెంకన్న శనివారం మధ్యాహ్నం తన ఇంటి పక్కన ఉన్న బాత్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నక్క చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఎండుతున్న పంటలకు పరిహారం చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మునుకుంట్లలో వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి ఎండుతున్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలోని ఎండుతున్న వరి పొలాలను ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట చేతికి వచ్చే తరుణంలో నీరు లేక వరి చేలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు పంటల సర్వే చేసి నష్టపోతున్న పంటలను గుర్తించి పరిహారం చెల్లింపునకుగాను ప్రభుత్వానికి నివేదిక అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తరాల బలరాములు, నాయకులు పోగుల నర్సింహ, దాసరి సంజయ్, పెద్ది బాల నర్సింహ, నల్లమాద సైదులు, వడ్డె సైదిరెడ్డి, సుధాకర్, సైదులు, అంతటి శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని ఓ వెంచర్ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండల కేంద్రంలోని సాయినాథ్ కాలనీకి చెందిన చేపల వ్యాపారి గుర్రం గణేష్(34)కు అప్పులు తీర్చలేక మనోవేదనకు గురవుతున్నాడు. ఇటీవల తన కారు అమ్మి కొంత అప్పు తీర్చాడు. అయినప్పటికీ పూర్తిగా అప్పు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శనివారం ఇంట్లో నుంచి బయల్దేరి బీబీనగర్‌కు చేరుకున్నాడు. తన స్నేహితుడు సునీల్‌కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి బీబీనగర్ సమీపంలోని శ్రీలోగిల్లు వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి అన్న శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

చనిపోతూ మరో ఐదుగురికి ప్రాణదానం

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం చేసిన బంధువులు



నారాయణ (ఫైల్)

కనగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను అతడి బంధువులు దానం చేసి మరో ఐదుగురికి ప్రాణం పోశారు. కనగల్ మండలం రేగట్టే గ్రామానికి చెందిన తిరందాసు నారాయణ(63) చండూరు పట్టణంలో కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19న సాయంత్రం షాపు మూసివేసి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా. రేగట్టే–కురంపల్లి గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డుపై అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో నారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల అంగీకారం మేరకు శనివారం రాత్రి నారాయణ అవయవాలను వైద్యులు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



బాధితుడికి చైన్ అప్పగిస్తున్న సూర్యాపేట పట్టణ సీఐ వీరరాఘవులు

సూర్యాపేటటౌన్: పోగొట్టుకున్న బంగారు గొలుసును బాధితుడికి సూర్యాపేట పట్టణ పోలీసులు ఆదివారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం వస్రాం తండా గ్రామానికి చెందిన ధరావత్ శ్రీకాంత్ ఆదివారం సూర్యాపేటకు వచ్చాడు. ఈ క్రమంలో శ్రీకాంత్ తన మెడలో ఉన్న 2.5తులాల బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. ఆ గొలుసు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద షౌకత్ అలీ అనే వ్యక్తికి దొరకగా అతడు సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ వీర రాఘవులుకు గొలుసు అప్పగించాడు. అప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన శ్రీకాంత్‌దే బంగారు గొలుసు అని నిర్ధారించుకుని వెంటనే అతడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చైన్‌ను అప్పగించారు. నిజాయితీగా దొరికిన బంగారు చైన్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన షౌకత్ అలీని సీఐ అభినందించారు.

రుణమాఫీ కాలేదనే గాంధీభవన్‌కు వెళ్లా

- శాలిగౌరారం మండల రైతు తోట యాదగిరి



మాట్లాడుతున్న రైతు తోట యాదగిరి

శాలిగౌరారం: తనకున్న రూ.3లక్షల పంట రుణం మాఫీ కాలేదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రిని కలిసేందుకని గాంధీభవన్‌కు వెళ్లానే తప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కాని కాంగ్రెస్ పార్టీని గాని అభాసుపాలు చేసేందుకు కాదని శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రైతు తోట యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక రైతుగా తన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ప్రయత్నించానన్నారు. దీనిని కొన్ని పార్టీలు రాజకీయం చేయడం సరికాదన్నారు. తన కుటుంబ సభ్యులకు రైతు భరోసా వచ్చిందని, సన్న ధాన్యం బోనస్ కూడా తన కుమారుడి ఖాతాలో జమ అయ్యాయని పేర్కొన్నారు. రుణమాఫీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాలేదని, ఈ ప్రభుత్వ పాలనలో కూడా కాకపోవడంతో ఆవేదనతో గాంధీభవన్‌కు వెళ్లానన్నారు. ఇప్పటికైనా తనకు రుణమాఫీ చేసి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడ దానయ్య, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నోముల జనార్దన్, నాయకులు గర్దాసు లింగయ్య, లింగస్వామి, కృష్ణయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై ఊరేగిన స్వర్ణగిరీశుడు



గజవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం మాడ వీధుల్లో గజవాహన సేవ, అమ్మవారికి హంసవాహన సేవ నిర్వహించారు. సాయంత్రం సింహవాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, ఆలయం అర్చకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

మిర్యాలగూడ టౌన్: లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద ఆదివారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం పల్లిగొండ గ్రామానికి చెందిన కవితారాణి, ఆమె భర్త రామేశ్వర్‌సింగ్ కారులో ఆంధ్రప్రదేశ్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా.. మిర్యాలగూడ మండలం గుడూరు వద్ద తిరుపతి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కవితారాణి తలకు బలమైన గాయం కాగా రామేశ్వర్‌సింగ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం పర్యటనలో భారీ పోలీసు బందోబస్తు

- ఆంక్షలతో ఇబ్బందులు పడ్డ భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేసిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, ఏఎస్పీ రాహుల్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. ముగ్గురు డీసీపీలు, ఏడుగురు అడిషనల్ డీసీపీలు, 10 మంది ఏసీపీలు, 20 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలతో పాటు ఇంటలిజెన్స్, ఎస్‌బీ, రోప్ పార్టీ, కానిస్టేబుల్ సిబ్బంది కలిపి 500 మంది బందోబస్తులో పాల్గొన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఏసీపీ, సీఐలు, ఎస్‌ఐలు 100 మంది బందోబస్తులో ఉన్నారు. ఉదయం 6గంటల నుంచే యాదగిరి క్షేత్రాన్ని పోలీసులు, సీఎం సెక్యూరిటీ వింగ్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మెదటి ఘాట్‌రోడ్డు, రాయగిరి నుంచి యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం, ఎంట్రీ ఘాట్‌రోడ్డు, హెలిప్యాడ్ స్థలం, ప్రెసిడెన్షియల్ సూట్, కొండపైన అతిథి గృహం, యాగశాల, మాడ వీధులు, తిరు వీధులు, ప్రధానాలయ ముఖ మండపం, విమాన గోపురం సమీపంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం, పోలీసులు, కలెక్టర్ నుంచి వచ్చిన పాసులు ఉన్న వారిని మాత్రమే ఘాట్ రోడ్డులో అనుమతించారు.



బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

దర్శనానికి వచ్చిన భక్తుల ఇబ్బందులు..

సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామిని దర్శించుకునేందుకు, అలాగే మహాకుంభాభిషేకం సంప్రోక్షణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. పోలీసులు కొండపైన భక్తులకు ఆంక్షలు విధించారు. భక్తులు తమ వాహనాలను కొండ కింద పార్కింగ్ స్థలంలో నిలిపివేసి, ఆర్టీసీ బస్సుల్లో కొండ పైకి చేరుకున్నారు. భక్తులు కొండపైకి వచ్చిన సమయంలో క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఆలయంలోకి అనుమతించారు. కాగా.. సీఎం వచ్చిన నేపథ్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భక్తులకు దర్శనానికి అనుమతివ్వలేదు.



సీఎం రాకతో దర్శనాలు నిలిపివేయడంతో వేచిచూస్తున్న భక్తులు

దాతలకు స్వామివారి ప్రసాదం అందజేత

దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం కోసం విరాళాలు అందజేసిన దాతలను ఆలయాధికారులు ఆదివారం సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. విమాన గోపురానికి స్వర్ణ తాపడం కోసం రూ.లక్షకు పైగా విరాళాలు ఇచ్చిన 348 మంది దాతలకు ఆలయాధికారులు ఆహ్వానాలు అందజేసి, మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి రావాలని కోరారు. దీంతో పలువురు దాతలు కుంభాభిషేక సంప్రోక్షణ వేడుకకు హాజరయ్యారు. వారికి తూర్పు మాడ వీధిలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసి స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతర వారికి నృసింహుడి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు.

అన్నీ తానై వ్యవహరించిన ఈఓ

పంచకుండాత్మక యాగంతో పాటు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ నిర్వహణలో ఆలయ ఈఓ భాస్కర్‌రావు అన్నీ తానై వ్యవహరించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అధికారులు, ప్రధానార్చకుల సహకారంతో మహాక్రతువును విజయవంతంగా పూర్తిచేశారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మద్దిరాల: భర్త వేధింపులు తాళలేక ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన ఆకుల మల్లేష్, సరస్వతి దంపతుల పెద్ద కుమార్తె మనీషా(23) గతేడాది తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సంపత్‌ను ప్రేమ వివాహం చేసుకొని హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌లో నివాసముంటున్నారు. కొంతకాలంగా సంపత్ మనీషాను వేధిస్తుండడంతో శనివారం రామాంతాపూర్‌లోనే వారు ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

సోమేశ్వరాలయంలో డైరెక్టర్ శంకర్ పూజలు

వేములపల్లి(మాడ్గులపల్లి): మండలంలోని చిరుమర్తి గ్రామంలో గల శ్రీవరాల సోమేశ్వరాలయంలో శివాలయ గౌరవ అధ్యక్షుడు, సినీ డైరెక్టర్ నిమ్మల శంకర్, మాధవి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ సింహద్వారాన్ని ప్రతిష్ఠించారు. స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన సామగ్రిని ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో పూజారి కూరెళ్ల వెంకటాచారి, గొట్టిపర్తి బచ్చయ్య, తాళ్లపల్లి మిన్నయ్య, నమోజు ఉపేంద్రచారి, శంకరాచారి, నాగాచారి, నక్క ఉపేందర్, కొండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ 2, 3 & 4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి డి-మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్స్, స్విమ్మింగ్‌పూల్, సంప్ర : Ph: 7013578378 [HA-1181]

Wanted

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [M-SCA25001809]

■ శ్రీబాలాజీ హోంకేర్: Hydలో సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంట పనికి (స్త్రీ/పు) కావలెను. జీ: 18000/- రూం+మీల్స్ ఫ్రీ. ✆ 95731 83331 [G-1940]

■ సాయిరామ్ హోంకేర్: Hydలో బేబికేర్, పేషెంట్ కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు ఇంటిపని/వంటపనికి మనుషులు (ఆడ/ మగ) కావలెను. జీ:18 వేలు. 9949094607, 9908454607 [SCA25001838]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA25001803]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్గొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592